## క్లుప్తంగా

### జాతరలో మాజీ ఎమ్మెల్యే



జాతర పూజల్లో వెంకటేగౌడ

గంగవరం: మండలంలోని గండ్రాజుపల్లిలో గంగమ్మ జాతరను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శిరస్సు మెరవని అనంతరం అమ్మవారి శిరస్సును గ్రామంలో ప్రతిష్ఠించి ఉదయం నుంచి వేడుకగా పూజలు చేశారు. మహిళలు అమ్మ వారికి సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ గంగజాతరలో పాల్గొన్నారు. అమ్మ వారి దర్శనానంతరం పూజలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం పలువురు పార్టీ నాయకుల శుభకార్యాల్లో నాయకులతో కలిసి పాల్గొన్నారు.

### బీసీ హాస్టల్ విద్యార్థికి ప్రశంస



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రాకేష్ యాదవ్

పలమనేరు: పట్టణానికి చెందిన ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థి రాకేష్ యాదవ్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ప్రశంసించినట్టు స్థానిక బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సోమసుందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లాలోని బీసీ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు ఇటీవల వెలువడిన పది పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులను సాధించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా స్థానిక బీసీ హాస్టల్‌కు చెందిన రాకేష్ యాదవ్ 600 మార్కులకుగాను 553 మార్కులు సాధించి జిల్లాలో హాస్టల్స్ టాపర్‌గా నిలిచాడు. దీంతో అతనికి కలెక్టర్ ప్రశంసాపత్రంతోపాటు అభినందనలు తెలిపినట్టు వార్డెన్ పేర్కొన్నారు.

### గంగమ్మకు ప్రత్యేక పూజలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారులు

పలమనేరు: పట్టణంలోని తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా నాల్గవ రోజు ఆదివారం స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణానికి చెందిన బలిజ అభ్యుదయసేవాసంఘం వారు పొద్దున, పలమనేరు పరిరక్షణ సమితి వారు సాయంత్రం పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవార్ల అలంకరణలు భక్తులను అలరించాయి.

### కంటి వైద్యశిబిరానికి స్పందన



ఆపరేషన్లకు ఎంపికైన వారితో వైద్యబృందం, ఫౌండేషన్ నిర్వాహకులు

బైరెడ్డిపల్లి: మహతీ ఫౌండేషన్ వారి సహకారంతో బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 47 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో ఏడుగురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీఈఎస్ వైద్యాధికారులు, ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

### మత్తుమందులు విక్రయిస్తే కేసులు



మెడికల్ షాపు యజమానులతో మాట్లాడుతున్న సీఐ

పుంగనూరు: పట్టణంలోని మెడికల్ షాపుల్లో అనుమతులు లేని మత్తుమందులు విక్రయిస్తున్నారని, ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ సుబ్బరాయుడు హెచ్చరించారు. ఆదివారం రాత్రి ఎస్ఐ లోకేష్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌లో మెడిల్‌షాపు యజమానులతో కలిసి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలోని యువతకు ట్యాబ్లెట్లు, సిరప్‌ల రూపంలో మత్తుమందులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వైద్యుల అనుమతులు లేకుండా మత్తుమందులు, నిద్ర మాత్రలు ప్రభుత్వం నిర్ణయించిన మేరకే విక్రయించాలని తెలిపారు. లేకుంటే షాపు యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక వాయిదా

కుప్పం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యకమం వాయిదా వేస్తున్నట్లు కడా కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రతినెలా సోమవారం జరిగే ఈ కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు వారు తెలిపారు.

# ఆనాటి రచ్చబండలు ఏవీ?

- పల్లెల్లో కనుమరుగైన రచ్చబండలు
- గతంలో ఓ వెలుగు వెలిగిన వైనం
- గ్రామాభివృద్ధిలో ఇవి కీలకం
- రచ్చకాడ తెగిన పంచాయితీలెన్నో



జగమర్లలోని గ్రామ రచ్చబండ

పలమనేరు: గతంలో పల్లెలు అనగానే టక్కున గుర్తుకు వచ్చేది గ్రామంలోని రచ్చబండ, దానికానుకునే రావిమాను. గ్రామంలో ఏ శుభకార్యం జరగాలన్నా ఊరి పెద్దమనుషులు రచ్చబండపై కూర్చుని సమష్టిగా నిర్ణయం తీసుకునేవారు. దీన్ని గ్రామస్తులు పాటించేవారు. వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామస్తులకు వచ్చిన ఎటువంటి కష్టమైనా ఆ పంచాయితీ రచ్చబండ కాడ పరిష్కారమయ్యేది. గ్రామాలాభివృద్ధిలోనూ రచ్చబండలు, అక్కడి పెద్ద మనుషులు, ఊరిపెద్ద ఎంతో క్రియాశీలక పాత్ర పోషించేవారు. అయితే నేడు పల్లె వాతావరణం కనుమరుగైంది. పల్లెలో గ్రామ పెద్దలు లేరు, రచ్చబండలు కానరావడం లేదు. కొన్ని గ్రామాల్లో మాత్రం పాత తరాలకు తీపి గుర్తుగా రచ్చబండలు నేటి దర్పానికి సాక్ష్యంగా మూగబోయి అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి.

**పల్లెకు గుండెకాయ రచ్చబండ**

పలమనేరు నియోజకవర్గంలో 90 పంచాయతీలుండగా 500 గ్రామాలున్నాయి. ఇందులో పురాతన గ్రామాలు 250దాకా ఉన్నాయి. ఈగ్రామాల్లో నాటి తరం ఊరి మధ్యలో రచ్చబండలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 40 గ్రామాల్లో మాత్రం రచ్చబండలు కనిపిస్తున్నాయి. అయితే రచ్చబండలపై కూర్చొని మాట్లాడుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం కనిపించడం లేదు. రచ్చబండ్ల వద్ద పులిమేక, దాయాలాటలకు వేదికలయ్యాయి. కొందరు రచ్చబండపై కూర్చుని సెల్‌ఫోన్లు చూసుకుంటున్నారు. అప్పట్లో గ్రామంలో సాయంత్రమైతే గ్రామంలోని వారంతా రచ్చబండవద్దకొచ్చేవారు. గ్రామంలో జరిగే మంచి చెడ్డ అక్కడ చర్చించుకునేవారు. కుటుంబాల్లోని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కారమయ్యేవి. గ్రామంలో కొందరు కులపెద్దలు, ఊరి పెద్దలుండేవారు. నాడు రచ్చబండ ఉన్న గ్రామాల్లోకి పోలీసులు సైతం వెళ్లేవారు కాదట. చాలా వరకు రచ్చబండ వద్ద సమిసిపోయేవి. ఏదేని తప్పుచేస్తే రచ్చబండ పంచాయితీ ఉంటుంది, జనం ఎంతో బాధ్యతగా ఉండేవారు. రచ్చబండ రాజకీయాలకు సైతం వేదికగా ఉండేది. గ్రామాలకు ఎవరైనా ప్రముఖులు, నాయకులు వచ్చినా రచ్చబండే వేదికయ్యేది. గ్రామంలో ఏ ఇంట ఏమి జరిగినా సమాచారం రచ్చబండకు చేరేది. కానీ నేడు ఆ పరిస్థితిలేదు. గ్రామాల్లోనూ ప్రాశ్చాత్తీకరణ ప్రభావం, ఉమ్మడి కుటుంబాలు విచ్చిన్నంతో సమాజంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో రచ్చబండలు కనిపించడం లేదు. గ్రామ పెద్దల ఉనికే లేకుండా పోయింది.

**సమాజంలో మార్పు**

సమాజంలో వచ్చిన మార్పుతో పల్లెవాతావరణం కలుషితమైంది. సాయంత్రమైతే కటుంబీకులు ఇళ్లల్లో టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఎవరి పనుల్లో వారు బిజీగా గడపడం, వ్యవసాయం చేసేవారి సంఖ్య తగ్గడం, పట్టణాలకు వలసలు వెరసి పల్లెలకు కష్టాన్ని మిగిల్చాయి. ఒకరి విషయాల్లో మరొకరు తలదూర్చని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. ఫలితంగా పల్లెలో కక్షలు, కార్పణ్యాలు పెరిగి వివాదాలు ఎక్కువయ్యాయి. దీనికి తోడు గ్రామాల ఐక్యతకు రాజకీయాలు భంగం కలిగిస్తున్నాయి. అందుకే గ్రామాల నుంచి పోలీస్ స్టేషన్లకు చేరే ఫిర్యాదులు పెరిగాయి. గతంలో ఓ వెలుగు వెలిగిన రచ్చబండలు నాటి దర్పానికి నేడు మూగసాక్ష్యాలుగా అక్కడక్కడ దర్శమిస్తున్నాయి.

## ప్రజల భాగస్వామ్యం పెరగాలి



పుస్తకాలను అందజేస్తున్న కవులు, రచయితులు

పలమనేరు: గ్రంథాలయాల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలని పలమనేరు రచయితల సంఘ గౌరవాధ్యక్షుడు ఆర్ మాధవ్ సూచించారు. ఆమేరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాల పునర్వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ నేటి తరం పిల్లలకు పుస్తక పఠనంపై తల్లిదండ్రులు అవగాహన కల్పించి పుస్తకాలను చదివించేలా చూడాలన్నారు. గ్రంథాలయాల్లో సభ్యత్వాన్ని ఓ ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో సభ్యత్వ రుసుమును రచయితలు మిఠాయి యుగంధర్‌బాబు, గిరిధర్‌మూర్తి, పలమనేరు బాలాజీ, సీతారామయ్య చెల్లించారు. గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను వారు అందజేశారు. లైబ్రేరియన్ హేమంత్‌కుమార్, స్థానిక సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## ఉగ్రవాదులను అంతం చేయాలి



ర్యాలీ చేస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

పుంగనూరు: పహల్గామ్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను అంతం చేయాలని హిందూ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను అంతం చేసేందుకు యుద్ధమే ఆయుధం అంటు నినాదాలు చేశారు. ఉగ్రవాదాన్ని అణచివేసి, భారతదేశాన్ని కాపాడాలని కోరారు.

## నేటి నుంచి కోనేటిరాయుని బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాలంకరణతో కోనేటిరాయుని ఆలయం

మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో నేటి నుంచి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అర్చకులు అంకురార్పణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా నేడు మధ్యాహ్నం 12గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేష వాహనంలో స్వామివారు విహరిస్తారని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర తెలిపారు.

- గంగవరం

## శ్రీవాసవీ దేవి ఉత్సవాలు



అమ్మవారి అభిషేక తీర్థాలను తీసుకెళ్తున్న మహిళలు

పుంగనూరు: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకన్యకాపరమేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వాసవీ మాత మహిళా సంఘ సభ్యులు కలిసి 102 కలశాలతో కోనేటి వద్దకు తీర్థాలు తీసుకెళ్లారు. అక్కడ పుష్కరిణిలో పూజలు చేసి, కలశాలన్నింటినీ తీసుకొచ్చి వాసవీదేవికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేసి అమ్మవారిని అలంకరించారు.

## యాళి వాహనంపై మృత్యుంజయేశ్వరుడు



యాళి వాహనంపై విహరిస్తున్న మృత్యుంజయేశ్వరుడు

చౌడేపల్లి: స్థానిక బజారువీధిలో వెలసిన శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన ఆదివారం రాత్రి స్వామి వారిని యాళి వాహనంపై ఊరేగించారు. అర్చకులు శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి యాళివాహనంపై స్వామివారిని కొలువుదీర్చారు. వాహనాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం మేళతాళాల నడుమ మండల పురవీధుల్లో ఊరేగించారు. శివనామస్మరణలతో మారు మోగింది. ఉభయదారులుగా కె.అశోక్‌కుమార్, సుదర్శన్ కుటుంబీకులు వ్యవహరించారు. కళాకారులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

## ఐడియా అదిరింది



టమాట తోటలో ఏర్పాటుచేసిన దిష్టిబొమ్మ

చౌడేపల్లి: పంటలను కోతులు, అడవిపందులు నుంచి రక్షించుకోవడంతోపాటు ఏపుగా పెరిగిన టమాట తోటకు దిష్టి తగలకుండా ఉండేందుకు ఓ రైతు ఐడియా అదిరింది. కాగతి పంచాయతీ యనమసామనపల్లెకు చెందిన రైతు భాస్కర్‌రెడ్డి టమాట తోటలో పులి తలతోపాటు మనిషి ఆకారంలో ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మ ఆకర్షణీయంగా నిలిచింది. ఈ దిష్టిబొమ్మను చూసిన ప్రతిఒక్కరూ ఐడియా అదిరిందంటూ నవ్వుకోవడం పరిపాటిగా మారింది.

# అపూర్వ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బైరెడ్డిపల్లి: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము చదువులమ్మ చెట్టు నీడలో అంటూ పూర్వ విద్యార్థులు ఒకే చోట కలిసి ఆనందం పంచుకున్నారు. బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1992–1993వ సంవత్సరపు పదవ తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో అప్పటి విద్యార్థులంతా కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజుల్లోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు గురువులు అందించిన చదువే నేడు అందరం ఈ స్థాయికి చేరుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. 32 ఏళ్ల తరువాత కార్యక్రమం జరగడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆనాటి గురువులైన బాలచంద్రనాయుడు, రామానాయుడు, కుమారస్వామి, జైచంద్రన్, దేవరాజులనాయుడును ఘనంగా సత్కరించారు. మధురమైన జ్ఞాపకాలను మదినిండా నింపుకొని తిరుగు ప్రయాణమయ్యారు.

# ఉచిత అంబులెన్స్‌లు సిద్ధం

- లయన్స్ క్లబ్ దార్వా ఒకటి, జీలు ద్వారా మరొకటి
- వీటికి డీజిల్ పోసి, బత్తా ఇస్తే చాలు




ఉచితంగా వచ్చే అంబులెన్స్‌లు, ఉచిత సేవలపై ఏర్పాటు చేసిన బోర్డులు

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నుంచి అత్యవసర రోగుల కోసం ఉచితంగా అంబులెన్స్‌లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని వీటిని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని పట్టణానికి చెందిన లయన్స్‌క్లబ్, లారీ వర్కర్స్ యూనియన్‌లు ఆదివారం పేర్కొన్నాయి. ఆమేరకు సాక్షి దినపత్రికలో 'అంబులెన్స్ నిర్వాహకుల దందా' అనే శీర్షికన ఆదివారం కథనం ప్రచురితం కావడంతో పట్టణానికి చెందిన పలువురు తీవ్రంగా స్పందించారు. ఆస్పత్రి వద్ద ప్రైవేటు అంబులెన్స్‌ల దందా ఎక్కువగా ఉందనే తాము అత్యవసర రోగులకు ఉచితంగా సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఆమేరకు ఈ రెండు అంబులెన్స్‌లను ఆదివారమే స్థానిక ఆస్పత్రి వద్దకు తరలించారు. అంబులెన్స్ సేవలు ఉచితంగా లభ్యమవుతాయంటూ ఆస్పత్రితోపాటు పట్టణంలో స్టిక్కర్లను అంటించారు. దీనిపై వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఆమేరకు పట్టణానికి చెందిన లయన్స్‌క్లబ్ ద్వారా ఓ ఉచిత అంబులెన్స్, లారీడ్రైవర్స్ సంఘం నుంచి జీలు ఆధ్వర్యంలో ఈ అంబులెన్స్‌లను అత్యవసర రోగులకు అందుబాటులో ఉంచారు. అవసరమైన వారు వీటికి డీజిల్ పట్టించుకొని డ్రైవర్‌కు బత్తా ఇస్తే చాలని సూచించారు. పలమనేరు ఆస్పత్రి నుంచి తిరుపతి, చీలాపల్లి, వేలూరు సీఎంసీలు, కుప్పం పీఈఎస్, కోలార్ జాలప్ప ఆస్పత్రులకు రోగులను తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు.

## నోటీస్ బోర్డు

### నేడు గ్రీవెన్స్‌డే

- పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నేటి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా ప్రత్యేక ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని ప్రజలు సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని అందులో పేర్కొన్నారు.

### అమ్మవారి సేవలో వైద్య మండలి చైర్మన్



ఆలయం వెలుపల హరీష్‌రావు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మను రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ హరీష్‌రావు ఆదివారం దర్శించుకున్నారు. ఆయన్ను ఆలయ మర్యాదలతో ఈఓ ఏకాంబరం స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి వేదపండితులచే ఆశీర్వచనం చేశారు.

### వీఆర్‌ఏల యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యామల లక్షణ



రొంపిచెర్ల: వీఆర్ఏల యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యామల లక్ష్మణను నియమిస్తూ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌ఏల యూనియన్‌లో కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించామని తెలిపారు. లక్ష్మణ మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్యకు రుణపడి ఉంటానని తెలిపారు.

### ప్రముఖ వైద్యుడు రామచంద్రారెడ్డి మృతి



డాక్టర్ రామచంద్రారెడ్డి (ఫైల్)

పుంగనూరు: ప్రముఖ వైద్యుడు రామచంద్రారెడ్డి (76) అనారోగ్యంతో ఆదివారం వేకువజామున మృతిచెందారు. ఆయన మృతి వార్త తెలియగానే ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోన్‌లో ఆయన కుమారుడు డాక్టర్ చైతన్య తేజారెడ్డితో మాట్లాడి పరామర్శించారు. కాగా గత 45 సంవత్సరాలుగా ఆయన, ఆయన సతీమణి డాక్టర్ జ్ఞానావతమ్మ కలిసి తేజ ఆస్పత్రి ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందించారు. రామచంద్రారెడ్డి వామపక్షవాదిగా ఉండేవారు. భార్యభర్తలు ఇద్దరు విప్లవ రచయితల సంఘంలో సభ్యులుగా పనిచేశారు. ఆయన పలు పుస్తకాలను రచించారు. ఆయన మృతిచెందడంతో వందలాది మంది ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన మాలేనత్తంలో నిర్వహించారు.

### ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

సదుం: స్థానిక ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్ష జరిగింది. పరీక్షను జిల్లా బీసీ సంక్షేమ అధికారి మునీంద్రయ్య తనిఖీ చేశారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 191 మంది దరఖాస్తు చేసుకోగా 126 మంది హాజరైనట్లు డిపార్ట్‌మెంటల్ అధికారి జ్యోత్స్న, పరీక్షల నిర్వహణ అధికారి శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.



పరీక్షను పరిశీలిస్తున్న మునీంద్రయ్య